క్లుప్తంగా

కాశీ యాత్రకు బయల్దేరిన భక్తులు



రైల్వేస్టేషన్‌లో భక్తుల సందడి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆర్యవైశులు, భక్తులు శుక్రవారం కాశీ యాత్రకు బయల్దేరి వెళ్లారు. సికింద్రాబాద్–దానాపూర్ రైలులో దాదాపు 200 మంది భక్తులు 9 రోజుల యాత్రలో భాగంగా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి వారికి పండ్లు, అల్పాహారం, ఒడి బియ్యం, పసుపు కుంకుమ పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, బల్దియా వైస్ చైర్మన్ గిరీష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలువేరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేలల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి



పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి చేలల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ఏవో రామకృష్ణ అన్నారు. మండలంలోని రాస్పెల్లి, సారసాల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పత్తి పంటలో సాళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూడాలని, అధిక వర్షాలకు మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశాలు ఉన్నాయన్నారు. మొక్క వయస్సును బట్టి 10 గ్రాముల పోటాషియం నైట్రేట్ లేదా 19:19:19 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పంట ఎదుగుదల కోసం వర్షాలు తగ్గాక 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



రమణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా రమణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2022 మార్చి నుంచి అక్టోబర్ వరకు పెంచికల్‌పేట ఎస్సైగా పనిచేసిన ఈయన అక్టోబర్ 2022 నుంచి జులై 2023 వరకు ఆసిఫాబాద్ ఎస్సైగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఈజ్‌గాంకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జగదీశ్ మంచిర్యాల టౌన్‌కు బదిలీ అయ్యారు.

పెంచికల్‌పేట్ ఎస్సైగా కొమురయ్య



కొమురయ్య

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఎస్సైగా కొమురయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై విజయ్ కుమార్‌ను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొమురయ్య బాధ్యతలు చేపట్టగా, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఎస్సై పేర్కొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ పవన్

వాంకిడి: గత మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని ఖమాన గ్రామంలోని గొల్లగూడకు చెందిన అసంపల్లి రాందాస్ ఇంటికి గురువారం వరదనీరు చేరింది. మట్టిగోడలు తడిసి శుక్రవారం ఇల్లు కూలిపోయింది. రాందాస్ బయటికి పరుగెత్తడంతో ప్రమాదం తప్పింది. కూలిన ఇంటిని సర్పంచ్ పెందూర్ పవన్ పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని హామీఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించి తక్షణసాయం అందేలా చూడాలని అధికారులను కోరారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

తిర్యాణి: అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ అనంతరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఓటరు నమోదుపై బీఎల్‌వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరుగా నమోదుకు ఫారం–6, చిరునామ మార్పునకు ఫారం–8 పూరించాల్సి ఉంటుందన్నారు. ఆర్‌ఐ మోహన్ తదితరులు ఉన్నారు.



దహెగాంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు



దహెగాం: గుడిసెలో చేరిన వర్షపు నీరు



జనగాం గ్రామ సమీపంలో కోతకు గురైన రోడ్డు

అతలాకుతలం

- భారీ వర్షాలకు పొంగిన వాగులు
- రోడ్లపై ప్రవహిస్తున్న వరదనీరు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు

జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగాయి. వరదలతో అతలాకుతలమవుతున్న గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి రోడ్లు కోతకు గురయాయి. పత్తి పంటలు నీట మునిగాయి. పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తలోడిలో కూలిన ఇంటి గోడ



గూడెం వద్ద ప్రాణహిత ఉధృతి

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి, రాజురా, రహపల్లి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. 48 గంటలపాటు కురుస్తున్న వానలకు గుండి, అప్పపల్లి, తుంపెల్లి వాగులు ఉప్పొంగడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మించాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్, గిరిజన నాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం అనార్‌పల్లి వాగును సందర్శించారు. వర్షాలకు ప్రతి ఏటా వాగు పొంగి ప్రవహించడంతో 10 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొన్నారు.

సిర్పూర్(టి) మండలంలో..

సిర్పూర్(టి): కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ, ఇతర వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి వరద ఉధృతిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

వాగును పరిశీలించిన ఎంపీడీవో..

మండలంలోని భూపాలపట్నం వాగును శుక్రవారం సిర్పూర్(టి) ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వరద ఉధృతికి రోడ్డు కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లడంతో పరిస్థితిని పరిశీలించి వివరాలు సేకరించారు. రోడ్డు మరమ్మతుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

కౌటాల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించింది. భారీ వర్షం కారణంగా దాదాపు 18 గంటల పాటు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమీప పత్తి చేన్లు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇళ్లలో చేరిన వరదనీరు..

భారీ వర్షం కారణంగా కౌటాల, ముత్తంపేట్ గ్రామాల్లో ఇళ్లల్లో వరదనీరు చేరింది. స్థానిక సర్పంచులు వొజ్జల మౌనిశ్, ఆదే శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ లోతట్టు ప్రాంతాలను పరిశీలించి వరదనీటిని మళ్లించారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాణహిత నది, పెన్‌గంగా నదులతోపాటు వాగులు, వంకలు ఉప్పొంగాయని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



భూపాలపట్నం–కేశవపట్నం మధ్యలో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్



ఉప్పొంగి ప్రవహిస్తున్న చింతలపాటి వాగు



కోయపల్లి వద్ద కోతకు గురైన వంతెన



దిందా వద్ద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



చింతలమానెపల్లిలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



నాగల్‌గొంది వాగులో నీరు చేరడంతో రెడ్ రిబ్బన్‌ను అడ్డంగా కట్టిన చిత్రం



తెగిన చిన్నపాట్నాపూర్ కల్వర్టు



మోతుగూడలో పత్తి చేనులో చేరిన వరద నీరు

రెబ్బెనలో..



వరద ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న గంగాపూర్ వాగు

రెబ్బెన: మండలంలోని పులికుంట, నంబాల, గంగాపూర్, పెద్దవాగు, కొండపల్లి, గుండాల వాగులు వరద ప్రవాహంతో పరవళ్లు తొక్కాయి. కుంటలు, చెరువుల్లో వరదనీరు వచ్చి చేరటంతో జలకళ సంతరించుకున్నాయి. వాగుల పరీవాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కార్యదర్శులు వరద ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాగా, గంగాపూర్‌లో నాయిని వెంకటికి చెందిన పెంకుటిల్లు శుక్రవారం ఒకవైపు కూలింది.



వర్షానికి ఒక వైపు కూలిన ఇల్లు

సుస్మీర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు బంద్



బ్రిడ్జి వద్ద కంచె ఏర్పాటు

బెజ్జూర్: వర్షాల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో రమేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుస్మీర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు సాగకుండా శుక్రవారం కంచె ఏర్పాటు చేశారు. భారీ వర్షాల దృష్ట్యా వాగులు, వంకలు దాటవద్దని తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

చెరువులా క్రీడా మైదానం



క్రీడా ప్రాంగణంలో నిలిచిన వరదనీరు

కౌటాల: మండలంలోని కనికి సమీపంలో తెలంగాణ క్రీడా మైదానం శుక్రవారం కురిసిన భారీ వర్షానికి చెరువులా తయారైంది. మైదానం స్విమ్మింగ్ పూల్‌గా మారిందని పలువురు అంటున్నారు. క్రీడా ప్రాంగణంలో వరదనీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

వర్షంలోనూ కొనసాగిన సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్/కౌటాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె శుక్రవారం నాటికి 16 రోజుకు చేరింది. కౌటాలలో వర్షంలోనూ తడుస్తూ సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కలెక్టరేట్ ఎదుట సమ్మెలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.



కౌటాల: వర్షంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

గ్రామాల్లో డ్రై డే

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచులు, కార్యదర్శులు, ఇంటింటికీ తిరిగి నిల్వ నీటిని తొలగింపజేశారు. డబ్బాల్లో, డ్రమ్ముల్లో ఉన్న నీటిని పారబోశారు. టైర్లలో నిల్వ ఉన్న నీటితో దోమలు వ్యాప్తి చెందుతాయని, నీటిని పారబోయాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



ముకంగూడలో నీటిని పారబోస్తున్న సర్పంచ్ లింబాదాస్

ఏఐటీయూసీ కైరిగూడ ఫిట్ కమిటీ ఎన్నిక

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీ ఏఐటీయూసీ ఫిట్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్, ఫిట్ కార్యదర్శిగా మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దేవరకొండ దివాకర్, ఏ రిలే ఇన్‌చార్జిగా రాయిని రాజయ్య, బీ రిలే ఇన్‌చార్జిగా మహమ్మద్ షకీల్, సీ రిలే ఇన్‌చార్జిగా పుట్ట అంజయ్య, బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జిగా మాల ఓదెలు, ఏసీ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జిగా దేవి శ్రీనివాస్, పంపు సెక్షన్ ఇన్‌చార్జిగా తిరుపతి, ప్రీవేబిన్ ఇన్‌చార్జిగా ఆవుల మల్లేశ్, పంపు ఆపరేటర్ల ఇన్‌చార్జిగా వై. శ్రీనివాసరావు, డీసీ సెక్షన్ ఇన్‌చార్జిగా మోసం గోపాల్ ఎన్నికయ్యారు.

మొబైల్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మొబైల్ పోగొట్టుకున్న, చోరీకి గురైనా బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 15 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పోగొట్టుకున్న 21 మొబైల్ ఫోన్లను తిరిగి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో 4, మావల పోలీసు స్టేషన్‌లో 5, ఇచ్చోడలో 3, ఆదిలాబాద్‌రూరల్‌లో 2, గాదిగూడలో 1, తాంసిలో 1, ఉట్నూర్‌లో 1 రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ ఉమేందర్ పాల్గొన్నారు.

రేపు విస్తృత స్థాయి జిల్లా సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, బాబాన్న ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు హాజరుకావాలని కోరారు.

జిల్లా ప్రజల ఆదరణను మర్చిపోలేను

- అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పనిచేసిన కాలాన్ని.. ఇక్కడి ప్రజలు చూపిన ఆదరణను జీవితంలో మర్చిపోలేనని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ రాజేశంను శుక్రవారం జిల్లా పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి సజీవన్, నాయకులు అంజనేయులు, మల్లన్న, కనకయ్య, లింగయ్య, శ్రీకాంత్, రాజమౌళి, కేదారి, చందు, సంజీవ్, శైలేందర్, శ్రీనివాస్, అజయ్, ప్రకాశ్, రమేశ్, మధు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హన్మాన్ ఆలయంలో అనుమానాస్పదంగా తవ్వకాలు!



గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి పక్కన పెట్టి హన్‌మాన్ విగ్రహం



విగ్రహం ప్రతిష్ఠించిన ప్రదేశంలో తవ్విన చిన్న గుంత

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడ పురాతన హన్మాన్ ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం పలువురు ఆలయం వైపు వెళ్లగా విషయం బయటపడింది. హన్మాన్ విగ్రహాన్ని తొలగించి మరో ప్రాంతంలో పెట్టారు. విగ్రహం ఉన్న ప్రాంతంలో గుంత తవ్వారు. అయితే పురాతన ఆలయం కావడంతో గుప్త నిధుల కోసమో, మద్యం మత్తులో ఆకతాయిలు తవ్వకాలు చేపట్టారా అనేది తెలియడం లేదు. ఎస్సై భూమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని తొలగించి చిన్నగా గుంత తవ్వినట్లు గుర్తించామన్నారు. తవ్వకాలపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

ముగిసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

నేరడిగొండ: 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం ముగిసింది. 2021–23 వరకు ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలను రైతు వేదికలో బీఆర్పీలు చదివి వినిపించారు. 32 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.1లక్ష 85వేల వరకు రికవరీ, రూ.15 వేల జరిమానా విధించినట్లు ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు తెలిపారు. నాగమల్యాల్, లఖంపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో అత్యధికంగా రికవరీ, ఫెనాల్టీలు ఉన్నాయన్నారు. డీఆర్‌డీఏ కిషన్, ఏపీడీ రాథోడ్ రవీందర్, అసిస్టెంట్ పీడీ సిద్దిఖ్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎస్టీఎం నరేందర్, ఎస్ఆర్పీ కొమురయ్య పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న తహసీల్దార్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో శుక్రవారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండో విడత ఓటరు నమోదు, సవరణలపైన అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేలా ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్ ఘటన పాశవిక చర్య'

ఆసిఫాబాద్‌అర్బన్: మణిపూర్‌లో మహిళలను రోడ్డుపై చిత్రహింసలకు గురిచేసిన ఘటన పాశవిక చర్య అని, దీనిని ప్రజలు ముక్త కంఠంతో ఖండించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమాయకులైన ఆడబిడ్డలను వివస్త్రలను చేసి, మహిళా లోకాన్ని అవమానించిన వారిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు కఠినంగా అమలు చేయాలని కోరారు.